## క్లుప్తంగా

### పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ రాజేంద్రన్

గంగాధరనెల్లూరు: స్థానిక ఎమ్మార్సీలో శుక్రవారం ఎంఈఓ రాజేంద్రన్ చేతుల మీదుగా పీఆర్టీయూ క్యాలెండర్, వాల్ స్టిక్కర్‌ను ఆవిష్కరించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులురెడ్డి, ప్రధానకార్యదర్శి పురుషోత్తం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ క్యాలెండర్‌లో ఉపాధ్యాయులకు కావాల్సిన అన్ని విషయాలను పొందుపరచడం అభినందనీయమన్నారు. అనంతరం క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు గంగాధరం, రాజేంద్రరెడ్డి, చలపతి, చంద్రశేఖర్‌శెట్టి, రమేష్, దినకర్, మోహన్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నగరి: పారా లీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ విష్ణువర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ నగరి పరిధిలో 25 నుంచి 50 మంది వరకు పారాలీగల్ వలంటీర్లు అవసరమన్నారు. పదో తరగతి పాసై, ఎలాంటి వివాదాలు, సమస్యల్లో లేనివారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జీతాలు ఉండవని, సేవాభావంతో పనిచేసే వారు అవసరమన్నారు.

### డ్వాక్రా సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు ప్రభుత్వం అందజేసే బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో సీసీ, సంఘమిత్ర, లీడర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం డ్వాక్రా సంఘాల సభ్యులు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తుందన్నారు. గతంలో ఒక సభ్యురాలికి రూ.లక్ష వరకే లింకేజీ రుణాలు ఇచ్చేవారని చెప్పారు. ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.50 వేలు పెంచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, మంజుల, శోభ పాల్గొన్నారు.

### ఊరికి వెళితే సమాచారమివ్వండి



సీఐ రాజశేఖర్

నింద్ర: ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని నగరి రూరల్ సీఐ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పండుగలను పురస్కరించుకుని ఇల్లు వదలి, ఇతర గ్రామాలకు వెళ్లేవారు తమ విలువైన వస్తువులు బంగారం, నగదు బ్యాంక్ లాకర్‌లో ఉంచుకోవాలని సూచించారు. అలాగే పేకాట, జూదం, కోడి పందేలు తదితరాలు నిర్వహించడం నేరమన్నారు. విజయపురం, నింద్ర మండలాల్లో పలు గ్రామాల్లో ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### మార్కెట్ కాంట్రాక్టర్‌కు నోటీసు

పుత్తూరు రూరల్: స్థానిక కూరగాయల మార్కెట్ కాంట్రాక్టర్ ఎస్.రాజాకు నోటీసు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అధికంగా గేటు వసూలు చేస్తున్నారంటూ లిఖిత పూర్వకంగా ఆరోపణలు రావడంతో నోటీసు ఇచ్చినట్లు చెప్పారు. 22/2022 గెజిట్ ప్రకారమే కాంట్రాక్టర్ గేటు వసూలు చేయాలని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు.

### అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-90వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో పాఠశాలలో చేసిన చిలిపి చేష్టలను నెమరు వేసుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువు ధనంజయరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే గ్రంథాలయానికి పుస్తకాలను వితరణ చేశారు. తరువాత తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులకు శాలువలు కప్పి సన్మానించారు.

# సృజనశీలురు






మంత్రి రోజా చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థి (ఫైల్), నీటి శుద్ధి పరికరాన్ని తయారు చేస్తున్న విద్యార్థులకు సహకరిస్తున్న టీచర్

- నీటి శుద్ధి పరికరం నమూనా ప్రదర్శన
- జిల్లా, రాష్ట్రస్థాయిలో గ్రామీణ విద్యార్థుల రాణింపు
- జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



పార్థివ్ వర్మ, లోహిత్ యాదవ్

సైన్స్ అంటే సత్యం .. ఏదైనా అంశం ఊహాజనితంగా చెప్పడం వేరు.. దాన్ని నిర్ధారించి చెప్పడం వేరు. ఎంతో మంది శాస్త్రవేత్తలు పలు అంశాల్లో పరిశోధనలు చేసి, అనేక వస్తువులు రూపొందించారు. అలాంటి వారి స్ఫూర్తితో నేటి చిన్నారులు సైతం ఆ దిశగా దూసుకుపోతున్నారు. తమ సృజనాత్మకతో పలు వసతులకు సంబంధించిన నమూనాలను ప్రదర్శించి ఆకట్టుకుంటున్నారు. ఆ కోవకు చెందిన వారే వడమాలపేట మండలం తడుకు ఆర్ఎస్ జెడ్పీ హైస్కూలు విద్యార్థులు.



బయో మినరల్ వాటర్ ఫిల్టర్ నమూనా

వడమాలపేట: మండలంలోని తడుకు ఆర్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి సైన్స్ పోటీల్లో బయో మినరల్ వాటర్ ఫిల్టర్ నమూనాను ప్రదర్శించి జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించి, అవార్డులు సొంతం చేసుకున్నారు. వడమాలపేట మండలం తడుకు ఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో చదవుతున్న పార్థివ్‌వర్మ(తడుకు ఆర్ఎస్), లోహిత్ యాదవ్ (బట్టీకండిగ్ర) పల్లెటూరులో పుట్టి పెరిగి స్థానికంగా ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వీరిద్దరికి సైన్స్ పై ఉన్న మక్కువను ఆ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు భానుప్రసాద్ గుర్తించారు. వారిని ప్రోత్సహించి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్లకు తీసుకెళ్లారు. దీంతో వారిద్దరూ కలసి అవైడ్ ఆర్వో వాటర్, డ్రింక్ టాప్ వాటర్ అనే ప్రాజెక్టులో భాగంగా బయో మినరల్ వాటర్ ఫిల్టర్‌ను తయారు చేసి జిల్లా, రాష్ట్రస్థాయిలో అవార్డులు సొంతం చేసుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 9, 10, 11 తేదీల్లో తిరుపతి జిల్లా గూడూరులో జరిగిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్రస్థాయి పోటీల్లో బయో మినరల్ వాటర్ ఫిల్టర్ నమూనాను ప్రదర్శించారు. పార్థివ్‌వర్మ, లోహిత్ యాదవ్ ప్రదర్శించిన ఈ నమూనా జాతీయస్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైంది. దీంతో వీరిద్దరూ ఆంధ్రప్రదేశ్ తరఫున గుజరాత్‌లో జనవరి 25 నుంచి 31వ తేదీన జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

**బయో మినరల్ వాటర్ ఫిల్టర్ తయారీ**

తడుకు ఆర్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పార్థివ్‌వర్మ, లోహిత్ యాదవ్ తమ గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లోని భూగర్భ నీటిని, మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా వచ్చే నీటిని పరిశోధించారు. భూగర్భ జలాలు ఉత్తమం అని, ఇవి వాడితేనే మంచిదని రుజువు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో దొరికే నీటిలో ఖనిజలవణాలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజల ఆరోగ్యానికి, పిల్లల్లో మెదడు ఎదుగుదలకు అవసరమైన క్యాల్షియం, జింక్, మెగ్నీషియం, మాంగనీస్ తదితర ముఖ్యమైన ఖనిజ లవణాలు ఉన్నాయని నిరూపించారు. అయితే ఈ నీటిలో మలినాలను తొలగించడానికి బయో మినరల్ వాటర్ ఫిల్టర్ నమూనాను రూపొందించారు. ఇందుకు టీడీఎస్ వాటర్ ఫిల్టర్ సంస్థ, ఆర్‌డబ్ల్యూఎస్ (రసాయన శాల) నగరి వారి సహకారం తీసుకున్నారు.

**పరికరం తయారీ ఇలా..**

పైన ఒక ప్లాస్టిక్ కంటైనర్, అడుగున మరో ప్లాస్టిక్ కంటైనర్ ఏర్పాటు చేశారు. పైభాగంలోని ప్లాస్టిక్ కంటైనర్‌లో సెడిమెంట్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. అడుగుభాగం లోని ప్లాస్టిక్ కంటైనర్‌లో యాక్టివేటెడ్ కార్బన్ అంటే బొగ్గు పొడి నింపారు. ఆ కింది కంటైనర్‌లో కోరల్ సాండ్, మినరల్ టోన్స్ ఆ తరువాత ఆల్కలైన్ మినరల్ బాల్స్, పొటాషియం బాల్స్, సూపర్ సిరామిక్ బాల్స్, క్యాల్షియం బాల్స్ ఏర్పాటు చేశారు.

# సంక్రాంతి సందడి




వస్త్రదుకాణాల వద్ద బారులు తీరిన జనం

- భోగి మంటలకు ఏర్పాట్ల
- నూతన వస్త్రాల కొనుగోలులో జనం బిజీ

నగరి: పట్టణంలో సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. పెద్ద పండుగను పెద్ద ఎత్తున జరుపుకోవాలన్న తపన ప్రజల్లో కనిపిస్తోంది. భోగి పండుగను ఘనంగా జరుపుకోవడానికి శుక్రవారం జనం సర్వం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికీ పల్లెలు, ప్రధాన కూడళ్ల వద్ద భారీ స్థాయిలో భోగి మంటలు వేస్తుంటారు. ఇలా భోగి మంటలు ఏర్పాటు చేసేందుకు యువత పోటీ పడుతున్నారు. గ్రామ పొలిమేరల్లో పెద్దపెద్ద చెట్ల కొమ్మలు, తాటి మట్టలు సేకరించి గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో పోగు చేస్తున్నారు. మరో పక్క చిన్నారులు భోగి మంటల వద్ద డప్పులు కొట్టడానికి వాటిని కొనుగోలు చేసుకుంటున్నారు. దుకాణయజమానులు యువకులను ఆకర్షించడానికి వివిధ ఆకృతుల్లోని డప్పులను విక్రయాలకు ఉంచుతున్నారు. భోగి మంటల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకూడదని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పండుగ నేపథ్యంలో వ్యాపార సముదాయాలన్నీ సందడిగా మారాయి. వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. పండుగలో ప్రాధాన్యత సంతరించుకున్న చీరలు, గాజులు, ఇతర అలంకరణ సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చే మహిళలతో ఫ్యాన్సీ దుకాణాలు రద్దీగా ఉన్నాయి. ధనుర్మాస పూజల ముగింపును పురస్కరించుకుని గోదాదేవికి పసుపుతో అలంకరించడానికి స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద మహిళలు ఎక్కువ సంఖ్యలో హాజరై పసుపు దంచి ముద్దలు చేశారు.

**సంక్రాంతికి ఉత్సవాలకు సర్వం సిద్ధం**

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరులో ఉన్న ఆరిమాను గంగమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఆరిమాను గంగమ్మ ఆలయానికి తమిళనాడు, కర్ణాటక, తెలంగాణతోపాటు జిల్లా నలుమూలలు నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయంలో అమ్మవారికి జంతు బలులిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు సంక్రాంతి సందర్భంగా అమ్మవారిని దర్శించుకుంటారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈఓ తిమ్మారెడ్డి, చైర్మన్ లింగారెడ్డి, నిర్వాహకులు రమణప్రసాద్‌రెడ్డి తెలిపారు.



ఆలయం వద్ద పసుపు దంచుతున్న మహిళలు

**ప్లాస్టిక్ రహిత బోగిని జరుపుకోండి**



భోగి మంటల్లో ప్లాస్టిక్ వస్తువులు వేసి పర్యావరణాన్ని కలుషితం చేయకూడదు. భోగి మంటలు వేసే సమయంలో టైర్లు కాల్చడం చట్ట విరుద్ధం. సంక్రాంతి స్వచ్ఛతకు ప్రతీకగా నిలిచే పండుగ. దీనిని గుర్తించి ప్లాస్టిక్ రహితంగా భోగిపండుగను, సంక్రాంతిని జరుపుకోవాలని కోరుతున్నాను.

–వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి

## వైఎస్సార్‌సీపీ నేత కుటుంబానికి మంత్రి సోదరుడి పరామర్శ



మోహన్‌ను పరామర్శిస్తున్న కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: మండలంలోని కుందిమాకుల గుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వి.వెంటేశ్వర్లు కుటుంబ సభ్యులను పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి పరామర్శించారు. మున్సిపాలిటీ 12వ వార్డు పరిధిలోని కుందిమాకులగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.వెంకటేశ్వర్లు శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుమారస్వామి రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి వెంకటేశ్వర్లు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతుడు కుమారుడు మోహన్‌ను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, కౌన్సిలర్ బాలాజీ, కోఆప్షన్ సభ్యులు చీరాల, నాయకులు జనార్దన్‌యాదవ్, చిరంజీవియాదవ్, కడియాలనాయుడు, తదితరులు ఉన్నారు.

## అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నగరి: పట్టణంలోని బైపాస్ కూడలి సమీపంలో ఉన్న శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప భజనలు, అర్చన, నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు భజనల్లో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, రమేష్ బాబు, మాదురి, దిలీప్‌కుమార్, భార్గవి, దేవేంద్ర, దుర్గాప్రకాష్ స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

## హృద్రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి



వైద్యులతో మాట్లాడుతున్న నవీన్‌కుమార్

పుత్తూరు రూరల్: ప్రభుత్వాస్పత్రులకు వచ్చే గుండె జబ్బు రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన పుత్తూరు ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్డియాక్ స్టెమీ ప్రాజెక్టు నిర్వహణ పనితీరును పరిశీలించారు. ఈసీజీ నిర్వహణపై స్థానిక డాక్టర్‌తో డెమో చేయించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఏడాదిగా దేశ వ్యాప్తంగా అక్కడక్కడ స్టెమీ ప్రాజెక్టును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం గుండె జబ్బుతో వచ్చిన రోగికి ఈసీజీ తీసిన తర్వాత ఎస్టీ ఎలివేషన్ టైప్ హార్టెటాక్ వస్తే వెంటనే ×ఎలాక్సిమ్× అనే ఇంజెక్షన్‌ను వేస్తారని తెలిపారు. రూ.40 వేలు విలువ చేసే ఎలాక్సిమ్ ఇంజెక్షన్‌లు ఆస్పత్రిలో అందుబాటులో ఉంచడం ఈ ప్రాజెక్టులో ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మెడికల్ కాలేజీ వారు ఈ ఇంజెక్షన్లను సరఫరా చేస్తారని తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో గత ఏడాదిలో నలుగురు రోగులకు ఈ ఇంజెక్షన్ వేయడంతోపాటు మెరుగైన వైద్యం అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడినట్లు తెలిపారు. పుత్తూరులో స్టెమీ ప్రాజెక్టు నిర్వహణ సంతృప్తికరంగా ఉందని చెప్పారు. అంతకు ముందు ఆక్సిజన్ ప్లాంట్, జనరల్ వార్డు, క్యాజువాలిటీ, డెలివరీ రూమ్, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, స్థానిక ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెంట్ డాక్టర్ శంకర్‌నరేన్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సభ్యుడు నారాయణస్వామి పాల్గొన్నారు.

## నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న సీహెచ్ డీటీ విజయకృష్ణ

పాలసముద్రం: ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు మంజూరు చేస్తున్న నిత్యావసర సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ విజయకృష్ణ తెలిపారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని చౌకదుకాణ డీలర్లతో తహసీల్దార్ బాబు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని తూకాలు తేడాలు లేకుండా సక్రమంగా ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిత్యావసర సరుకులకు డీడీలు సకాలంలో కట్టి, సరుకులు సక్రమంగా అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.

## బాల్ బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



కోచింగ్ క్యాంప్ పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు, కోచ్, పీడీలు

నగరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే పోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో పాల్గొనే జట్టుకు శుక్రవారం కోచింగ్ క్యాంప్ ప్రారంభించారు. స్థానిక పీసీఎన్ ఉన్నత పాఠశాల మైదానంలో నగరి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ రవిబాబు, చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ చైర్మన్ సురేష్ బాబు ఆధ్వర్యంలో కోచింగ్ క్యాంపు నిర్వహించారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. ఈ క్యాంప్‌నకు హాజరైన క్రీడాకారులు ఈ నెల 23, 24, 25వ తేదీల్లో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. ఈ క్యాంప్‌లో కోచ్ గోపి, పీడీలు దాము, బాబు తదితరులు పాల్గొన్నారు.

## గంధోత్సవానికి సర్వం సిద్ధం



గంధోత్సవానికి ముస్తాబైన దర్గా

కార్వేటినగరం: పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న హజరత్ సయ్యద్‌షా సబ్బర్ అవులియా జవాలి గంధోత్సవ నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ 14వ తేదీ శనివారం రాత్రి 8 గంటలకు గంధం ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం దర్గాలో ఫతేహా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ప్రఖ్యాత ఖవ్వాలి గాయకుడు ముంబాయికి చెందిన మొయిన్‌నాజీం, హైదరాబాద్‌కు చెందిన సిరాజ్‌తాజ్ ఆధ్వర్యంలో ఖవ్వాలి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజుకు సన్మానం



టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులను సన్మానిస్తున్న క్షత్రియులు



పాలసముద్రం: కనుమూరి బాపిరాజు దంపతులకు స్వాగతం పలుకుతున్న క్షత్రియులు

కార్వేటినగరం: టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులను స్థానిక క్షత్రియులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతో కలసి వేణుగోపాలస్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ వేద పండితులు ఆశీర్వచనం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. తరువాత మండలంలోని క్షత్రియులు టీటీడీ మాజీ చైర్మన్ దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి సన్మానించారు. కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ తాను టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు స్కంధపుష్కరిణి చుట్టూ సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ.75 లక్షలు మంజూరు చేసి అభివృద్ధి చేశానని చెప్పారు. అలాగే వేణుగోపాలస్వామి ఆలయ దర్శనార్థం ఏపీ టూరిజం బస్సులను భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట క్షత్రియులు ధనంజయవర్మ, పురుషోత్తంరాజు, జనార్దన్‌రాజు, నాగేశ్వరరాజు, యువరాజు, శేఖర్‌రాజు, చందురాజు, రవిరాజు, సుబ్రమణ్యంరాజు, అంబరీష్‌రాజు, గణేష్‌రాజు తదితరులు ఉన్నారు.

**బలిజకండ్రిగలో..**

పాలసముద్రం: మండలంలోని టీటీడీ కల్యాణ మండపంలో టీటీడీ మాజీ చెర్మన్ కనుమూరి బాపిరాజుకు శుక్రవారం క్షత్రియులు ఘనంగా సన్మానం చేశారు. అంతకుముందు కనుమూరి బాపిరాజుకు మంగళవాయిద్యాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివప్రకాష్‌రాజు మాట్లాడుతూ కనుమూరి బాపిరాజు మాజీ మంత్రిగా, టీటీడీ చైర్మన్‌గా ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన పారిశ్రామిక వేతలు ఎంఎం గిరిరాజు, రమేష్ రాజు, రవిరాజు, బాబు రాజు పాల్గొన్నారు.

## వెల్ఫేర్, డిజిటల్ ఉద్యోగులు ఉన్నట్లా.. లేనట్లా?



వనదుర్గాపురంలో తెరవని వెల్ఫేర్ అసిస్టెంట్ గది

పాలసముద్రం: మండలంలోని వనదుర్గాపురం సచివాలయం ఉదయం 10.30 గంటలు దాటినా తెరవలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రతి రోజూ సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్, డిజిటల్ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో హాజరు వేసి, వెళ్లిపోతున్నారు. దీంతో సమస్యలు పరిష్కారం కోసం కార్యాలయానికి వస్తున్న ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. గ్రామీణుల ఇక్కట్లు తొలగించాలన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. అయితే అధికారులు మాత్రం సీఎం ఆశయానికి తూట్లు పొడుస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ విద్యావతిని వివరణ కోరగా వనదుర్గాపురంలోనే కాదు మండలంలోని పలు సచివాలయాల్లో సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవని తెలిపారు.

## ముళ్ల పొదల తొలగింపు



ముళ్లపొదలను తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పుత్తూరు రూరల్: మున్సిపాలిటీ ఒకటో వార్డు కట్టకిందరామకృష్ణాపురం రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన ముళ్లపొదలను శుక్రవారం తొలగించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. అనంతరం శ్మశాన స్థలాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమాలను కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ గుణశేఖర్ పర్యవేక్షించారు.

## క్షయను నివారిద్దాం

పూతలపట్టు: ఆరోగ్య సూత్రాలను పాటించి, క్షయ వ్యాధిని నివారిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి. ప్రకాశం, జిల్లా క్షయ నివారణ అధికారి రవిరాజు పిలుపునిచ్చారు. పూతలపట్టు మండలం పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిశ్చయ పోషణ అభియాన్‌లో భాగంగా క్షయ బాధితులు 40 మందికి పోషకాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భరంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 1,565 మంది క్షయ బాధితులు ఉన్నారన్నారు. బాధితులు వైద్యుల సూచనల మేరకు మందులు వాడడంతోపాటు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

## జెడ్పీలో క్రీడా పోటీలు



చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భా గంగా శుక్రవారం ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లో తీసుకెళుతున్న ఉద్యోగులపై ప్రభు త్వం చిత్తశుద్ధితో ఉందని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడంతో ఉద్యోగుల్లో ఆహ్లా ద, స్నేహపూరిత వాతవారణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఐదుగురు జూదరుల అరెస్టు

చిత్తూరు రూరల్: మండలంలోని అనంతాపురంలో ఐదుగురు జూదరులను శుక్రవారం బీఎస్ఆర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. రహస్య సమాచారం మేరకు దాడులు చేసి, పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 3,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు



పెద్దహరిజనవాడలో అధికారులతో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్ఓ

చిత్తూరు రూరల్: సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య సిబ్బంది తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి ప్రకాశం ఆదేశించారు. చిత్తూరు నగరం పెద్ద హరిజనవాడలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి, దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ అముద, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ లోకేష్, మెడికల్ ఆఫీసర్ శివకుమార్, పీర్ సాహెబ్, సిబ్బంది లోకనాథం, ప్రతాప్, నారాయణ, గోపి, వసంత, ఆశ పాల్గొన్నారు.